# ఉద్వేగాల మాటున వాస్తవాలు

**కె.బాలగోపాల్**

దేశం చాలా ఆవేశంగా ఉంది. చాలా అసహనంగానూ ఉంది. 'ఇంక ఓర్చుకోలేం' అంటున్నారు. 'ఇప్పటికి జరిగిన నష్టం చాలు' అంటున్నారు. 'ఇంక ఉదాసీ నంగా ఉండడానికి వీలులేదు' అంటున్నారు. 'కఠినచర్యలకు సమయం ఆసన్నం అయింది' అంటున్నారు. ఎప్పుడూ ఏ సామాజిక సమస్యల గురించీ మాట్లాడని వర్గాల వారు ఈ మాటలు అంటున్నారు.

ప్రభుత్వం ఏం చేయాలని? ఏం చేసి ఉండాలని? ఏం చేసి ఉంటే కిందటి వారం ముంబాయిలో జరిగిన దాడి ఆగి ఉండేదని? అనుమానం మీద ఎవరినయినా కాల్చి పారే యొచ్చునన్న చట్టం పోలీసుల చేతిలో ఉంటే ఆగేదా? (అటువంటి చట్టం ఉండాలని ఇప్పుడు చాలామంది మనస్సులలో ఉందనుకుంటాను). ముంబయి పోలీసులకు ఎవరి మీదా అనుమానం రాలేదు మరి. అటువంటప్పుడు అట్లాంటి చట్టం ఉన్నా కూడ ఆగేది కాదు కదా? పర్యవేక్షణ వ్యవస్థ వైఫల్యం అనీ పోలీసు నిఘా వ్యవస్థ వైఫల్యం అనీ అంటున్నారు. జరగకూడనిది జరిగినట్టయితే అది జరగకుండ చూసే బాధ్యతగలవారు విఫలమయినట్టేననే తర్కం ప్రకారం ఇది సత్యమే గానీ, ఆ దాడి ఏ విధంగా జరిగిందో తెలిస్తే తప్ప పోలీసు సమాచార వ్యవస్థ దానిని పసిగట్ట వలసి ఉండిందా, పసిగట్టకపోవడంలో నిర్లక్ష్యం వహించిందా అనేది తేల్చలేం. తేల్చకుండ పోలీసు పర్యవేక్షణ, నిఘా పెంచాలన్న డిమాండుకు పెద్దగా అర్థం లేకపోగా అది కొత్త సమస్యలు తెచ్చి పెట్టగలదు.

దాడి ఏ విధంగా జరిగిందో మీడియా మనకు చెప్పేసిందని చాలామంది అనుకుంటుండవచ్చు. కానీ మీడియా ఎన్ని కథలు చెప్పిందో! దాడిచేసిన వారు అప్పటికప్పుడు తీరం వద్ద పడవ దిగి నేరుగా వచ్చి దాడికి పాల్పడ్డారని అన్నారు. లేదు, కొన్ని రోజులుగా ఇక్కడే ఉంటూ క్షుణ్ణంగా ఆ ప్రదేశాన్నంతా అధ్యయనం చేశారనీ కూడ అన్నారు. నాలుగు రోజుల ముందు తాజ్ హోటల్‌లో విద్యార్థుల పేరు మీద బస చేశాని వారి స్థానిక మిత్రులు వచ్చి కలిసి వెళ్లారనీ అన్నారు. అసలు స్థానికు లెవ్వరినీ కలవలేదనీ గతంలో స్థాని క మద్దతుదార్లకు సమాచారం ఇవ్వడం వల్ల నష్టం జరిగిన ఉదంతాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి పూర్తిగా గోప్యంగా ఉంచారనీ కూడ అన్నారు. తాజ్ హోటల్ సిబ్బందిలో ఎవరో వారికి సహకరించారని అన్నారు. అటువంటిదేమీ లేదని ఆ హోటల్ యాజమాన్యం స్వయంగా అనింది. హోటల్‌ను మొత్తం పేల్చేయడానికి పథకం వేసుకున్నారని అన్నారు. అది నిజమయి ఉండే అవకాశం లేదని వారి దగ్గర అంత మందుగుండు లభ్యం కాలేదని ఎన్ఎస్‌జి కమాండరే అన్నారు.

వాస్తవమేమిటంటే దాడి మొదలయిన అరగంట నుంచి దృశ్య మీడియా దాని పూర్వాపరాల గురించి కథనాలు ప్రసారం చేస్తూనే ఉంది. ఎవరూ వెనుకబడిపోకూడదన్న ఆదుర్దాలో ప్రతీ ఒక్కరూ తమ ఊహలను, తమకు అందుబాట్లో ఉన్న పోలీసు అధికారుల ఊహలనూ కలగలిపి కథనాలు కల్పించి మన ముందు ఉంచారు. ఈ కథనాలలో అధిక భాగం 'అదిగో తోక అంటే ఇదిగో పులి' అనే కోవకు చెందినవే. కొంతకాలం గడిస్తే తప్ప నిజంగా ఏం జరిగిందో తెలిసే అవకాశం లేదు. అప్పుడు తప్ప దాడిని నిలువరించడంలో వైఫల్యం నిజంగా ఎంతమేరకుందో తెలిసే అవకాశం లేదు. ఏడేళ్ల కింద జరిగిన పార్లమెంటు దాడి కేసును ఈ సందర్భంలో జ్ఞాపకం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. దాడి జరిగిన వెంటనే ఎవరు చేశారు, ఏ విధంగా చేశారు అంటూ అనేక కథనాలు ప్రసారం అయ్యాయిగానీ చివరికి నేరపరిశోధన పూర్తిచేసి కోర్టులో నివేదిక దాఖలు చేసే నాటికి, దాడిచేసిన అయిదుగురి పేర్లతో సహా ఏమీ తెలియలేదని తేలింది. మొదట్లో ప్రసారమైన కథనాల ననుసరించి నిఘాను, పర్యవేక్షణను తీర్చిదిద్ది ఉంటే ఏమైనా ప్రయోజనం ఉండేదా?



పోలీసు బలగాల సంఖ్యనూ పర్యవేక్షణ బాధ్యతనూ పెంచడం ఎప్పుడయినా మంచిదే కదా అంటారేమో. పోలీసు పహరా పౌర స్వేచ్ఛలకు భంగం కలిగించకుండ కేవలం దుండగులను మాత్రం అరి కట్టగలుగుతుందనుకోవడం భ్రమ. ఫైవ్ స్టార్ హోటల్ బయట నిలబడి మనం దేనికైనా సిద్ధపడాలని ఆవేశపడే వారికి, అస్పష్టమైన లక్ష్యంతో పెరిగే పోలీసు పహరా పొట్ట కూటికోసం సకల వేళలలో, సకల ప్రాంతాలలో సంచరించక తప్పని వారికి ఎంత కష్టం కలిగిస్తుందో అర్థం కాకపోవచ్చు. పోలీసు పహరాకు ఎప్పుడయినా స్పష్టమైన కర్తవ్య నిర్దేశనం ఉండాలి, ఆ పరిధిలోనే జరగాలి. లేకపోతే సాధారణ పౌర జీవితం దుర్భరంగా తయారవుతుంది.

అంటే కోపం వస్తుందేమోగానీ, గడచిన అయిదారు రోజులుగా వింటున్న ఆగ్రహం వెనుక దెబ్బతిన్న అహం ఉందన్న అభిప్రాయం కలగక మానదు. మనది ఇప్పుడెంత మాత్రం చిన్నదేశం కాదన్న అభిప్రాయం కొద్ది సంవత్సరాలుగా మనలో బలపడింది. పెద్ద దేశాలతో భుజం భుజం కలిపి సంచరించే దేశంగా మనల్ని మనం భావించుకుంటు న్నాం. అటు వంటి మన మీద, మూతిమీద ఇప్పుడిప్పుడే మీసాలు మొలుస్తున్న పది మంది పొరుగుదేశపు యువకులు దాడి చేయడం, అందునా మన ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువ యిన కార్పొరేట్ పెట్టుబడికి సంకేతాలయిన తాజ్, ఒబెరాయ్ వంటి హోటళ్లపైన దాడిచేసి ఖరీదయిన మనుషులను సహితం హతమార్చడం మధ్యతరగతి భారతీయుల అభి జాత్యాన్ని దెబ్బ తీసినట్టుంది. ఏ సందర్భంలోనయినా అన్నీ తెలిసిన ముఖాలతో అందరినీ తక్కువ చేసి మాట్లాడే ఇంగ్లిష్ టివి యాంకర్లు సహితం ఆవేశానికీ దుఃఖానికీ లోనుకావడం వెనుక ఉన్న మానవీయత ఎంత, దెబ్బ తిన్న అభిజాత్యం ఎంత అంటే చెప్పడం కష్టమే. అదే దాడి అదే ముంబాయిలోని ధార్‌వి లోనో మరొక మురికివాడలోనో జరిగి ఉంటే ఎప్పటిలాగే అంటీ ముట్టని సానుభూతికి పరిమితం కాకపోదురా? ఊహలెందుకు – కొద్దికాలం క్రితమే అస్సాంలో భీకర మారణకాండ జరిగింది. బంగ్లాదేశీ ముస్లింలకూ బోడో ఆది వాసులకూ మధ్య జరిగిన ఆ ప్రాణాంతక ఘర్షణకు దేశం స్పందించిన తీరును ముంబాయి దాడికి స్పందించిన తీరుతో పోలిస్తే ఈ తేడా అర్థం అవుతుంది. దేశ హోంమంత్రి కాదు కదా, కనీసం అస్సాం రాష్ట్ర హోం మంత్రి సహితం రాజీనామా చేయలేదు, రాజీనామా చేయాలన్న ఒత్తిడీ లేదు.

పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పాలన్న ఆరాటం మనలో చాలా ఉంది. ఏమని చెప్పాలి? ఆ దేశం ఈ రకమైన దాడుల నుంచి తనను తానే కాపాడుకోలేకపోతున్నది. ముంబాయిలో దాడి చేసినట్టు భావిస్తున్న బాపతు వారే పాకిస్థాన్ లోనూ దాడులకు పాల్పడుతున్నారు. ఆ దేశ రాజధానిలోని లాల్ మసీదును స్థావరంగా ఏర్పరచుకొని దాడులకు పాల్పడుతున్నారని చెప్పి వారిని అక్కడి నుంచి బయటకు తరమడానికి మొన్న ముంబాయిలో భారత బలగాలు చేసిన దానికంటే తీవ్రమైన పోరాటం పాకిస్తాన్ బలగాలు చేయవలసి వచ్చింది. అంతెందుకు, పాకిస్తాన్‌లో అత్యంత ప్రజాదరణ గల నాయకురాలయిన బేనజీర్ భుట్టోను ఈ మిలిటెంట్లే చంపుతామని చెప్పి మరీ బహిరంగంగా హత మార్చారు. తన మాజీ ప్రధానినే కాపాడుకోలేకపోయిన దేశాన్ని మన దేశంలోని హోటళ్లను కాపాడలేక పోయినందుకు శిక్షించాలా?

అటువంటి మిలిటెంట్ గ్రూపులు పాకిస్థాన్‌లో స్థావరం ఏర్పరచుకొని హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నందుకు పాకిస్థాన్ నైతిక బాధ్యత వహించనక్కర లేదా అంటారేమో. నైతిక బాధ్యత ప్రస్తావన వచ్చినట్టయితే ప్రధానంగా అమెరికా వైపు చూపించవలసివస్తుంది. అఫ్ఘానిస్తాన్‌లో తన ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం అమెరికా పాకిస్థాన్‌కు ఈ జాడ్యాన్ని అంటించింది. ఇప్పుడు చేతులు దులిపేసుకొని న్యాయనిర్దేశనం చేస్తున్నది. న్యాయంగా ఆలోచించేట్టయితే పాకిస్థాన్‌కు మనం ఇయ్యవలసింది


మిలిటెంట్ గ్రూపులు పాకిస్థాన్‌లో స్థావరం ఏర్పరచుకొని హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నందుకు పాకిస్థాన్ నైతిక బాధ్యత వహించనక్కర లేదా అంటారేమో. నైతిక బాధ్యత ప్రస్తావన వచ్చినట్టయితే ప్రధానంగా అమెరికా వైపు చూపించవలసివస్తుంది. అఫ్ఘానిస్తాన్‌లో తన ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం అమెరికా పాకిస్థాన్‌కు ఈ జాడ్యాన్ని అంటించింది. ఇప్పుడు చేతులు దులిపేసుకొని న్యాయనిర్దేశనం చేస్తున్నది.


సానుభూతి. ద్వేషం కాదు. అమెరికా సృష్టి అయిన ఈ సాయుధ మిలిటెంట్లు ఒక ప్పుడు ఐఎస్ఐ అదుపులో ఉండేవారేమో గానీ ఇప్పుడు ఆ అదుపు కూడ వారిపైన అంతగాలేదు.

'పోటా' లాంటి చట్టాలు కావాలి, కఠినమైన చర్యలు కావాలి, ఇంక అణచివేత, మానవహక్కులు వంటి సున్నితమైన మాటలు మాట్లాడొద్దు అంటున్నారు. పోటా పోలీసుల 'ఇంటెలిజెన్స్'ను పెంచదు. పెంచుకునే పరికరాలూ ఇవ్వ దు. సందేహాస్పదమైన సాక్ష్యంతో శిక్షవేసే అవకాశం నేర విచారణ వ్యవస్థకు ఇస్తుంది. ఏ హింసకూ పాల్పడకున్నా కేవలం భావ సారూప్యత ఉన్నందుకు వ్యక్తులను శిక్షించే అవకాశం ఇస్తుంది. దీనితో సమస్య పరిష్కారం కాదు. దాడులను ఆపే శక్తి ఆవగింజంత పెరగదు. దాడులకు సంబంధించిన సమాచారం తెలుసుకునే శక్తి సహితం ఆవగింజంత పెరగదు. కానీ చాలామందిని జైలులో పెట్టిన సంతృప్తి ఇస్తుంది. ఇదా కావలసింది? ఇక అణచివేత, మానవ హక్కులు మొదలయిన విషయాల మాటకొస్తే, ఈ మధ్యనే మనం శ్రీలంకకు చెప్పిన హితవును జ్ఞాపకం చేసుకుందాం. ఎల్‌టిటిఇపైన శ్రీలంక ప్రభుత్వం చేస్తున్న పోరులో సామాన్య తమిళ ప్రజలు హింసకు గురి అవుతున్నారని తమిళనాడుకు చెందిన సకల రాజకీయ పార్టీలూ ఆందోళన వ్యక్తం చేశాయి. వెంటనే శ్రీలంక ప్రభుత్వం పైన భారత ప్రభుత్వం ఒత్తిడి పెట్టాలనీ లేకపోతే బాగుండదనీ అల్టిమేటం జారీ చేశాయి. భారత ప్రభుత్వం సహితం, అది వారి ఆంతరంగిక విషయమని గానీ, ఎల్‌టిటిఇ వంటి దయలేని ప్రత్యర్థిని ఎదుర్కొనేటప్పుడు ఇటువంటి సున్నితమైన ప్రశ్నలు లేవదీయకూడదని గానీ అభ్యంతరం చెప్పలేదు. శ్రీలంక ప్రభుత్వానికి జాతి, మతం, భాషలతో నిమిత్తం లేకుండ ప్రజల హక్కులు కాపాడడంలో ప్రభుత్వానికి ఉండే బాధ్యత గురించి లెక్చర్ ఇచ్చింది. భారత ప్రజలందరూ హర్షించారు. ఆ విషయం అప్పుడే మరచిపోతే ఎట్లా?